**రిపోర్టర్లు కావలెను**

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న 'జర్నలిస్ట్ ఫైల్' దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం :
9502535152, 7416812467



మంగళవారం 02.07.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -147 www.journalistfile.com పేజీలు 4 వెల : రూ.5.00


## ప్రతీ రూపాయికీ జవాబుదారిగా ఉంటాం

- మాది సాధింపుల ప్రభుత్వం కాదు... ప్రజల ఆకాంక్షలు సాధించే ప్రభుత్వం
- 100 శాతం గ్రామాలకు రక్షిత మంచి నీరు అందించిన రాష్ట్రం చేయడమే మా ముందున్న లక్ష్యం
- గత పాలకులు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకుండా కేంద్ర నిధులు వదిలేశారు
- పంచాయతీరాజ్ శాఖలో అప్పులు చూసి... జీతం వద్దని చెప్పేశాను
- ప్రభుత్వ సిబ్బందితో సక్రమంగా పింఛన్ల పంపిణీ చేసి చూపించాం
- నాశనం అయిన వ్యవస్థలను బలోపేతం చేయడంపైనే దృష్టి
- నా ఆఫీసుకి కొత్త ఫర్నిచర్ వద్దు... అవసరమైతే నేనే కొనుగోలు చేసుకొంటా
- పిఠాపురం నియోజకవర్గం, గొల్లప్రోలులో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రి పవన్



**పిఠాపురం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** 'రాష్ట్రాభివృద్ధి... ప్రజా సంక్షేమం కోసం నేను బలమైన సంకల్పంతో ఎన్నికలకు వచ్చాను. ప్రజలంతా జనసేనను వంద శాతం విశ్వసించారు. వందకు వంద స్ట్రయిక్ రేటు ఇవ్వాలని కోరితే, ప్రజలంతా నిండు మనసుతో ఆశీర్వదించారు. ఇప్పుడు పాలనలోనూ అదే బలమైన సంకల్పాన్ని చేసుకుంటున్నాను.

100 శాతం గ్రామాలకు పూర్తిస్థాయి రక్షిత మంచినీటి పథకం అమలైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తయారు చేయాలి. ప్రతి గ్రామం గొంతు తడవాలి.. ప్రతి ఇంటికి లోటు లేకుండా నీరు అందాలి. కాలుష్యపు నీరు లేకుండా ప్రజలందరి ఆరోగ్యానికి భరోసా ఇవ్వాలి అన్నదే లక్ష్యమ'ని ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అన్నారు. మొన్నటి వరకు ఎన్నికల సమయంలో విమర్శలు, ప్రతివిమర్శలు అయిపోయాయి. ఇప్పుడు పూర్తిగా పాలనపారమైన సవాళ్లను అధిగమించాల్సి ఉందన్నారు.

గత ప్రభుత్వం వ్యవస్థలను పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేసిందనీ, వాటిని గాడిలోపెట్టేందుకు పూర్తి స్థాయిలో పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. సోమవారం పిఠాపురం నియోజకవర్గం, గొల్లప్రోలులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. రూ.3 వేల పింఛనును రూ.4 వేలు చేశారు. ఏప్రిల్ నుంచి అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు గత మూడు నెలలకు సంబధించిన రూ.3 వేలు కలిపి మొత్తంగా రూ.7 వేలు పింఛను ఇచ్చారు.

పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలుకి చెందిన దివ్యాంగురాలు మేడిశెట్టి నాగమణి కి మొదటి పింఛను అందించారు. అనంతరం పింఛనుదారులతో స్వయంగా మాట్లాడి వారి సాదక బాధకాలు తెలుసుకున్నారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "నన్ను నిండు మనసుతో ఆశీర్వదించి గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు వేవేల ధన్యవాదాలు. గెలవగానే పెద్ద ఊరేగింపు నిర్వహించాలని చాలామంది చెప్పారు. అయితే నియోజకవర్గానికి ఏదైనా మేలు కలిగించే విషయంతోనే వారి ముందుకు వచ్చి కృతజ్ఞత చెప్పుకోవాలనే తలంపుతో ఈ రోజు పింఛన్ల పంపిణీ కోసం నియోజకవర్గానికి వచ్చాను. నాకు సభలు, ఊరేగింపులు ముఖ్యం కాదు. నియోజకవర్గ ప్రజలంతా ఆనందంగా ఉండే పనులు చేసి, వారి మన్ననలు పొందడమే ముఖ్యం. ప్రతి నిమిషం రాష్ట్రశ్రేయస్సు కోసం, క్షేమం కోసం పని చేస్తాను. రక్షిత మంచినీరు, ఉపాధి అవకాశాలు, సాగునీటి కాలువల పూడిక తీతలు వంటివి చేసి ప్రజలకు దగ్గర కావాలనేది నా ఆకాంక్ష.

**పంచాయతీరాజ్ వ్యవస్థను నాశనం చేశారు:** కీలకమైన పంచాయతీరాజ్ శాఖను తీసుకొని ఆ శాఖలో జరిగిన ముఖ్య విషయాలను అధికారులను అడిగి తెలుసుకుంటుంటే గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలు బయటపడు తున్నాయి. పంచాయతీరాజ్

2లో

## టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి కేసులో దర్యాప్తు



**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై 2021 అక్టోబర్ 19న వైసీపీ నేతలు, కార్యకర్తలు చేసిన దాడి కేసుపై పోలీసులు విచారణ ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ నేత పట్టాభిరామ్ విమర్శలు చేయడంతో

2లో

# ఉత్సవంలా పెన్షన్ల పంపిణీ

## రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పండుగ



- పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమం
- మాటిచ్చినట్లుగానే తొలి నెల నుంచే పింఛన్లు పెంచి పంపిణీ
- 65.31 లక్షల మంది లబ్దిదారుల కోసం రూ.4408 కోట్లు ఖర్చు
- ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకుగా ఉంటా....మీ జీవితాలు మారుస్తా
- సంక్షేమం అంటే కేవలం డబ్బులు ఇవ్వడం కాదు...జీవన ప్రమాణాలు పెంచడం
- మళ్లీ 1995 నాటి సీఎంను చూస్తారు...అధికారులు కూడా కొత్త పాలనకు అలవాటు పడాలి
- చిత్తుచిత్తుగా ఓడినా వైసీపీ ఇంకా తన ఫేక్ ప్రచారాలనే నమ్ముకుంది
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- ఉదయం 6 గంటలకు మంగళగిరి నియోజకవర్గం పెనుమాకలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్న సీఎం
- పెనుమాకలో బానావత్ పాములు నాయక్ కుటుంబంలో ముగ్గురికి స్వయంగా పింఛన్లు పంపిణీ చేసి వారితో ముచ్చటించిన ముఖ్యమంత్రి
- ఆ గిరిజన కుటుంబానికి ఇల్లు మంజూరు చేసిన సీఎం
- అనంతరం పెనుమాకలో ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా లబ్దిదారులు, ప్రజలతో ముచ్చటించిన చంద్రబాబు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పండుగ వచ్చిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఒకే నెలలో పెన్షన్లకు రూ.4,408 కోట్లు ఖర్చు చేయడం చారిత్రాత్మకమని, ఇంతకంటే శుభదినం మరొకటి లేదని అన్నారు. మంగళగిరి నియోజకవర్గం, పెనుమాకలోని ఎస్టీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే లబ్ధిదారులకు పింఛను అందించారు. లబ్ధిదారుడు బాణావత్ పాములు నాయక్ కుటుంబానికి మొదటగా పెన్షన్ అందించారు. నాయక్ కూతురు ఇస్లావతి బాయికి వితంతు పెన్షన్, పాములు నాయక్ కు వృద్ధాప్య పెన్షన్, భార్య సీతా బాయికి రాజధాని పరిధిలో భూమిలేని వారికి ఇచ్చే వ్యవసాయ కూలీ పెన్షన్ ను అందించారు. అనంతరం నాయక్ కుటుంబ సభ్యులతో కాసేపు సీఎం ముచ్చటించారు. నాయక్ ఇల్లు లేదని సీఎంతో చెప్పగా తక్షణమే ఇల్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపి...ఇంటి నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని వెంటనే అధికారులను ఆదేశించారు. ఎస్టీ వాడలోనే తిరిగి స్థానికుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మసీదు సెంటరులో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులు, ప్రజలతో సీఎం చంద్రబాబు ముచ్చటించారు.

**ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలు**

"మీ అందరి దయ, ఆశీస్సులతో 4వ సారి సీఎంగా ప్రమాణస్వీకారం చేశాను. టీడీపీని ఆదరించిన గ్రామంలో పెన్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించాం. మంగళగిరిలో గత ఎన్నికల్లో లోకేష్ ఓటమి చెందారు...అయినా పట్టు వదలకుండా మళ్లీ ఇదే నియోజకవర్గంలో పట్టు సాధించి మీ అభిమానంతో ఎమ్మెల్యేగా గెలిచారు. గాజువాక, భీమిలి తర్వాత భారీ మెజారిటీ వచ్చిన నియోజకవర్గం మంగళగిరి. మిమ్మల్ని గౌరవించే బాధ్యత మాపై ఉంది. నేను 10 ఎన్నికలు చూశాను...ఎప్పుడూ చూడని విజయం మాకు దక్కింది. గత ఐదేళ్లలో ఇలా సంతోషంగా కూర్చొని మాట్లాడుకుంది ఒక్క రోజు కూడా లేదు. పోలీసులు ఎప్పుడు గోడ దూకి వస్తారో తెలీదు. భయంకర వాతావరణంలో ప్రజలు, నాయకులు బతికారు. ప్రజాస్వామ్యంలో న్యాయ నిర్ణేతలు ప్రజలే. ఐదేళ్లు అణచివేతకు గురయ్యారు...అలాంటి వేల మంది నన్ను కలవడానికి వస్తున్నారు. నాకు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారు. ప్రజలకు మాపై చాలా ఆశలు ఉన్నాయి. కానీ అన్నీ రాత్రికి రాత్రే జరిగిపోవు. రాష్ట్రానికి ఎంత అప్పు ఉందో అర్థం కావడం లేదు. పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టాలంటే భయపడుతున్నారు. ఐదేళ్ల వికృత చేష్టలతో రాష్ట్ర బ్రాండ్ దెబ్బతీశారు. గత సీఎం ఎక్కడికి వెళ్లినా పరదాలు కట్టుకుని వెళ్లారు. మురికి కాల్వ కూడా కనబడకుండా తెరలు కట్టారు...సమస్యలు దాస్తేదాగవు.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ప్రజలకు మేం సేవకులుగానే ఉంటాం**

"ఎన్నికల సమయంలో వాలంటీర్లతో పెన్షన్ పంపిణీ చేయొద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంచాలని చెపితే నాటి ప్రభుత్వం కుదరదని చెప్పింది. పంపిణీ చేయించడం చేతకాకపోతే ఇంటికి వెళ్లాలని చెప్పాను. వృద్ధులను సచివాలయాల చుట్టూ తిప్పి 33 మంది ప్రాణాలు తీశారు. ఇంటింటికీ పెన్షన్ ఇవ్వాలని మేము పోరాడినా వినలేదు. అందుకే ఇప్పుడు 1.20 లక్షల మంది సచివాలయ సిబ్బందితో పెన్షన్లు అందిస్తున్నాం. గత పాలకులు నోరిప్పితే అబద్ధాలు చెప్తున్నారు. ఐదేళ్ల పాటు అబద్ధాలు చెప్పి బతికారు. నేను, పవన్ ఎన్నికల ముందు జట్టు కట్టడానికి కారణం ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని. తర్వాత బీజేపీతో కలిసి రాష్ట్ర ప్రయోజనాలు ఆశించాం. ప్రజలు గెలవాలి రాష్ట్రం నిలవాలన్న ఆలోచనతో ముందుకు వెళ్లాం. నా చరిత్రలో ఎన్నో ఎన్నికలు చూశాను కానీ...ఇంతటి ఫలితాలు ఎప్పుడూ రాలేదు. మేము సేవకులుగా ఉంటాం తప్ప పెత్తందారులుగా ఉండేవాళ్లం కాదు. మీరు మాకు ఇచ్చింది అధికారం కాదు....బాధ్యత.' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**పెన్షన్ ఆద్యులు ఎన్టీఆర్**

"దేశంలోనే మొదటి సారి పెన్షన్ ను ప్రారంభించింది ఎన్టీఆర్. రూ.35లతో ప్రారంభించారు...తర్వాత దాన్ని నేను రూ.75లు చేశాను. 2014 వరకు రూ.200 మాత్రమే

2లో

## సూపర్ సిక్స్ అమలు చేస్తాం

### టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు



**విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ):** మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ అమలు చేసి తీరుతామని ఆంధ్రప్రదేశ్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పల్లా పాల్గొన్నారు. గాజువాక నియోజకవర్గం 67వ వార్డు హై స్కూల్ రోడ్లో పింఛన్లను టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి కూటమి మేనిఫెస్టోలో 1000 రూపాయలు పెంచుతామని ఇచ్చిన హామీ నెరవేర్చామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఒకేసారి వెయ్యి రూపాయలతో పాటు రూ.3000 వేలు కలిపి రూ.4000 ఇస్తున్నామని చెప్పారు. గడిచిన మూడు నెలలు రూ.3000, ఈనెల రూ.4000తో కలిపి మొత్తం రూ.7000 లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. ఎక్కడికి వెళ్ళినా ప్రజలందరూ ఆనందంతో స్వాగతం పలుకుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు పల్లా శ్రీనివాస్ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

## జగన్ మోసంతో ఒక్కో పేదకు 29 వేలు నష్టం



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** తూర్పు నియోజకవర్గంలో పెన్షన్ల పండుగను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. వరలక్ష్మి నగర్, నాగార్జున నగర్, పోలీస్ కాలనీల్లో పేదలకు స్వయంగా గద్దె రామ్మోహన్ పెన్షన్ అందజేశారు. వైసీపీ ప్రభుత్వంలో తమ పెన్షన్ తొలగించారని ఎమ్మెల్యేకు పలువురు వృద్ధులు తెలిపారు. ఆగస్ట్‌లో అర్హత ఉన్న వారికి పెన్షన్ లు మంజూరు చేసేలా చూస్తామని రామ్మోహన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోజు చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంలో పెన్షన్ పండుగ ప్రారంభమైందన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం జగన్ బటన్ నొక్కారన్నారు. పేదల సంక్షేమమే ముఖ్యంగా చంద్రబాబు వారి ఇళ్లకు వెళ్లి ఇస్తున్నారన్నారు.

2లో

## పరదాల సీఎం కాదు... 'ప్రజా సీఎం'ను చూస్తున్నాం : మంత్రి నారా లోకేష్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, పెనుమాక గ్రామంలో సోమవారం ఉదయం 6 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు , ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం మంగళగిరిలో శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందని, మంగళగిరి ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించాలని ముఖ్యమంత్రికి నివేదించారు. సీడ్ యాక్సిస్ రహదారి పూర్తి, అమరావతి నిర్మాణంలోనూ మంగళగిరి ప్రజలు ప్రభుత్వం వెన్నంటే ఉంటారని, మంగళగిరి నియోజకవర్గ ప్రజలు రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత తనపై ఉన్నందున అందుకు సహకరించాలని సీఎం చంద్రబాబును లోకేష్ కోరారు. గత అయిదేళ్ళు పరదాల సీఎంను చూశామని, ఇప్పుడు ప్రజా ముఖ్యమంత్రిని చూస్తున్నామని అన్నారు.

లోకేష్ వ్యాఖ్యలపై స్పందించిన చంద్రబాబు మాట్లాడుతూ.. ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. అధికారులు మారటానికి కొంచెం టైమ్ పట్టినా, త్వరలోనే సెట్ అవుతారని అన్నారు. 1995 తరహాలో సీఎం 4.0 చంద్రబాబును ఇక ప్రజలు చూస్తారని, రాజధానిలో భాగమైన మంగళగిరిలో అభివృద్ధిని పరుగులెత్తిస్తామని అన్నారు. గతంలో సీడ్ యాక్సిస్ రహదారి విస్తరణకు పెనుమాక ప్రజలు సహకరించలేదని.. ఈసారి ఎవ్వరూ అడ్డుపడకుండా రహదారి పూర్తికి అంతా సహకరిస్తారని ఆశిస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు.

## జనసేన విప్ లుగా బొమ్మిడి నాయకర్, అరవ శ్రీధర్

2లో

## ఇళ్లకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసిన సీఎం

**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీలో 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. మంగళగిరి నియోజకవర్గం పెనుమాక ఎస్టీ కాలనీలో సీఎం చంద్రబాబు పింఛను పంపిణీని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారు కుటుంబసభ్యులు ఇచ్చిన టీ తాగారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని పెనుమాకలోని ఎస్టీ కాలనీలో పాముల నాయక్ కుటుంబానికి సీఎం చంద్రబాబు తొలి పెన్షన్ అందించారు. పాముల నాయక్కు వృద్ధాప్య పెన్షన్, భార్యకు సీఆర్డీఏ పెన్షన్, కుమార్తెకు వితంతు పెన్షన్ డబ్బులు అందజేశారు.

వాళ్ల ఇంట్లో టీ తాగిన చంద్రబాబు అరగంట పాటు లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు ఇల్లు కావాలని



బాబును నాయక్ కుటుంబం కోరగా.. కేటాయిస్తానని సీఎం హామీ ఇచ్చారు.

## కాళ్ళు కడిగి, పెన్షన్ అందించిన మంత్రి నిమ్మల

**పాలకొల్లు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పెంచిన పెన్షన్ సొమ్ము పంపిణీ కార్యక్రమంను పశ్చిమ గోదావరి జిల్లా అడవిపాలెంలో ఉదయం 6 గంటలకు సోమవారం ప్రారంభించారు. గ్రామంలో దివ్యాంగునికి పళ్లెంలో కాళ్లు కడిగి 15 వేలు అందజేసి ప్రారంభించారు. దివ్యాంగులకు 15 వేలు, వృద్ధులు వితంతువులకు రూ. 7 వేలు అందజేసారు. అన్న మాట ప్రకారం సిఎం చంద్రబాబు విడతల వారి పెంపు కాకుండా ఒకేసారి పెంచుతూ మానవత్వం చాటుకున్నారని మంత్రి రామానాయుడు చెప్పారు. నాటి జగన్ పాలనలో విడతల వారి పెన్షన్ తో వృద్ధులు, వితంతువులు 32 వేలు నష్టపోయారని, 3 వేలు పెన్షన్ పెంచుతానని అధికారంలోకి వచ్చి వృద్ధులు, వితంతువులను జగన్ మోసం దగా చేశారని చెప్పారు.



## జగన్ మోసంతో ఒక్కో పేదకు 29 వేలు నష్టం

(మొదటి పేజీ తరువాయి)

పేదలు ఎవరో, పెత్తందారులు ఎవరో ప్రజలు గుర్తించారన్నారు. అందుకే జగన్నాటకాలు తెలుసుకుని ప్రజలు 11 స్థానాలతో సరిపెట్టారని గద్దె రామ్మోహన్ అన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాటను వెంటనే అమలు చేశారన్నారు. జగన్ రెండు నుంచి మూడు వేలు చేయడానికి ఐదేళ్లు తీసుకున్నారు. జగన్ మోసంతో ఒక్కో పేదకు 29 వేలు నష్టం చేశారన్నారు. గతంలో కూడా రెండు వందల నుంచి పింఛన్‌ను రెండువేలు చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. పెంచిన నాలుగు వేలకు మరో మూడు వేలు కలిపి నేడు ఏడు వేలు ఇస్తున్నారన్నారు. నాటకాలతో ఓట్ల రాజకీయం చేసిన వ్యక్తి జగన్ అయితే, పేదల పట్ల చిత్తశుద్ధి ఉన్న నేత చంద్రబాబు అని గద్దె రామ్మోహన్ తెలిపారు.

సాయం అంటే గుండెతో చేయాలి కానీ... ఓట్ల కోసం చేయడం సాయం కాదని జగన్‌కు సూచించారు. ప్రజలు ఇది అర్థం చేసుకునే వైనాట్ 175 అన్న వ్యక్తిని 11కే పరిమితం చేశారని గద్దె రామ్మోహన్ తెలిపారు. ఇప్పుడు అయినా వారు ఆత్మపరిశీలన చేసుకోకుండా ప్రజలపై నిందలు వేస్తున్నారన్నారు. ఆర్థిక భారాలు ఉన్నా పేదల సంక్షేమం ముఖ్యం అని చంద్రబాబు అన్నారన్నారు. సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం చంద్రబాబు ప్రత్యేకత అని కొనియాడారు. ఆ రాష్ట్ర సంపదను గతంలో వైఎస్, ఇప్పుడు జగన్ దోచుకున్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా ముంచేసి అప్పుల రాష్ట్రంగా జగన్ మిగిల్చారన్నారు. రాజకీయ కారణాలతో పెన్షన్ తొలగించి పేదల కడుపు కొట్టారన్నారు. అర్హత ఉన్నటువంటి పేదలను గుర్తించి ఆగస్ట్‌లో పెన్షన్ ఇచ్చే ఏర్పాటు చేస్తామన్నారు.

## టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి కేసులో దర్యాప్తు వేగవంతం


(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహించిన వైసీపీ మద్దతుదారులు దాడులకు తెగబడ్డారు. టీడీపీ కార్యాలయ సిబ్బందిపై దాడి చేసి ఫర్నిచర్, అద్దాలు, ఆఫీస్ ఆవరణలోని కార్లు ధ్వంసం చేశారు. అటు టీడీపీ నేత పట్టాభి నివాసంపై కూడా వైసీపీ శ్రేణులు దాడి చేశారు. ఇంట్లోని విలువైన వస్తువులు, ఫర్నిచర్ ధ్వంసం చేసి కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో పోలీసులు కొంతమంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

ఈ ఘటనపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేసినా జగన్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో విచారణ మాత్రం ముందుకు సాగలేదు. తాజాగా ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లెక్కలు మారుతున్నాయి. ఈ కేసు విచారణ వేగం పుంజుకుంటోంది. దాడికి సంబంధించి విచారణ చేపట్టిన పోలీసులు.. టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి సీసీ కెమెరాలు పరిశీలించారు. దాడుల్లో ఎవరున్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. అయితే వైసీపీ నేతలు దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి అనుచరులే దాడులకు తెగపడ్డారంటూ టీడీపీ శ్రేణులు చెప్తున్నారు. త్వరలోనే నిందుతులను గుర్తించే వారిని అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## జనసేన విప్‌లుగా బొమ్మిడి నాయకర్, అరవ శ్రీధర్

అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) : తమ పార్టీకి చెందిన ఇద్దరు శాసన సభ్యుల్ని ప్రభుత్వ విప్‌లుగా ప్రకటించాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన లేఖ రాశారు. నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను విప్‌లుగా నియమించాలని కోరినట్లు పవన్ రాజకీయ కార్యదర్శి పి. హరిప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



# ఉత్సవంలా పెన్షన్ల పంపిణీ





(మొదటి పేజీ తరువాయి)

ఉండేది... అధికారంలోకి రాగానే రూ. 1000కి పెంచి, తర్వాత రూ. 2000 చేశాను. ఇప్పుడు రూ. 3 వేలు ఉన్నదాన్ని రూ. 4 వేలకు పెంచాను. రూ. 4 వేల పెన్షన్ లో రూ. 2,875లను ఒక్క తెలుగుదేశం పార్టీనే పెంచింది. పేదలకు ఇచ్చే పెన్షన్ లో టీడీపీ హాయంలో పెంచిందే ఎక్కువ అని చెప్పడానికి గర్వపడుతున్నా. పెనుమాకలో 2,595 మంది వివిధ రకాల పెన్షన్ తీసుకుంటున్నారు. వీరికి ఒక నెల పెన్షన్ కు గతంలో రూ. 1.06 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ నెల పెన్షన్ కు రూ. 1.20 కోట్లకు పైగా ఖర్చు అవుతుంది. గుంటూరు జిల్లా మొత్తం 2,61,588 మందికి పెన్షన్లు ఇస్తున్నాం. వీరికి నెలకు ఇంతక ముందు వరకూ రూ. 81 కోట్లు ఖర్చు అవుతుంది..కానీ ఈ నెలలో రూ. 111 కోట్లకు పైగా ఖర్చు అవుతుంది. రాష్ట్రంలో 28 వర్గాల వారికి 65.31 లక్షల మందికి పెన్షన్లను అందిస్తున్నాం. పెన్షన్లకు ఇది వరకు నెలకు రూ. 1,938 కోట్లు ఖర్చు చేస్తే...ఇప్పుడు దానికి అదనంగా రూ. 819 కోట్లు ఖర్చు పెడుతున్నాం. ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిల కలిపి రూ. 1650 కోట్లు అదనంగా చెల్లించాం. ఈ ఒక్క నెలలోనే పేదలకు పెన్షన్ల కింద ఇస్తున్నది రూ. 4,408 కోట్లు. ఇంతకంటే శుభదినం మరొకటి లేదు.” అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**పేదలను తేదుకోవడమే మా ప్రభుత్వ ధ్యేయం**

“బానావత్ రాములు నాయక్ ఇంటికి వెళ్లి వృద్ధాప్య పెన్షన్ కింద రూ. 4 వేలు అందించా. ఆయన భార్య సీతాబాయికి సీఆర్డీయే పరిధిలో భూమిలేని వారికి అందించే జాబితా కింద రూ. 5 వేలు పెన్షన్ అందించాం. ఆయన కూతురు ఐలావత్ సాయిబాయికి వితంతు పెన్షన్ కింద రూ. 4 వేలు అందించాం. వీరికి మూడు నెలల బకాయిలతో కలిపి అందించాం. బీదవారైన రాములు నాయక్ కుటుంబం పూరింట్లో ఉంటోంది. కౌలుకు భూమి సాగు చేస్తే రూ. 8 లక్షల నష్టపోయారు. వారి పరిస్థితి చూడగానే చాలా బాధేసింది. ప్రభుత్వం తరపున ఇల్లు కట్టిస్తానని మాటిచ్చాను. ఇలాంటి వారు రాష్ట్రంలో చాలా మంది ఉన్నారు. పేదలను ఆదుకోవడమే మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇకపై ఏడాదికి రూ. 33,100 కోట్లు పెన్షన్ లబ్ధిదారులకు ఖర్చు చేయబోతున్నాం. రాబోయే ఐదేళ్లలో రూ. 1,65,500 కోట్లు పెన్షన్ల కింద పేదలకు ఖర్చు పెట్టబోతున్నాం. పేదలను ఆదుకునేందుకు ఒక మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం భగవంతుడు నాకు ఇచ్చిన గొప్ప అవకాశంగా భావిస్తున్నా.” అని సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు.

**ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకుగా ఉంటా**

“పరిపాలనలో మేము కష్టపడైనా సరే సంపద సృష్టించి ఆదాయం పెంచుతాం. పెరిగిన ఆదాయాన్ని పేదలకు ఖర్చు చేస్తాం. దీని ద్వారా పేదరికం లేని సమాజాన్ని తీసుకొస్తాం. ఒక హామీ ఇస్తే అమలు చేయాలంటే సుమారు ఐదారు నెలలు పడుతుంది. కానీ ప్రభుత్వం ఏర్పడిన 26 రోజుల్లోనే ఇచ్చిన హామీలు అమలు చేసి బకాయిలతో సహా అందించాం. దివ్యాంగులకు గత ప్రభుత్వం పెన్షన్ పెంచకుండా రూ. 3 వేల వద్దే నిలిపేసింది. అందుకే వారికి ఇప్పుడు రూ. 6 వేలకు పెంచాం. పూర్తిగా నడవలేని స్థితిలో ఉండే వారికి రూ. 5 వేల నుండి రూ. 15 వేలకు పెంచాం. కిడ్నీ, గుండె సమస్య, తలసేమియాతో బాధపడేవారికి రూ. 10 వేలు అందిస్తున్నాం. సంక్షేమ పథకాలు అందించామని గొప్పలు చెప్పుకోవడం కాదు..ప్రజల జీవితాల్లో వెలుగులు తీసుకురావాలి. జీవన ప్రమాణాలు పెంచడానికి మొదటి అడుగు వేశాం. సమాజమే దేవాలయం...ప్రజలే దేవుళ్లు అని చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన స్ఫూర్తితో పేదల జీవితాలు మార్చడంపై శ్రద్ధ పెట్టాం. ఆర్థిక అసమానతలు తగ్గించే వ్యవస్థకు రూపకల్పన చేస్తాం. ప్రభుత్వం ఆర్థికంగా దివాలా తీసింది...ఎంత అప్పులున్నాయో తెలియడం లేదు. అయినా పేదలను ఆదుకునేందుకు ముందడుగు వేశాం. రూ. 4 వేల పెన్షన్ వచ్చే వారికి యేడాదికి రూ. 48 వేలు వస్తుంది. రూ. 6 వేలు వచ్చే వారికి రూ. 72 వేలు వస్తుంది. మీకు ఎకరా మాగాని ఉంటే కౌలు రూ. 15 వేలు, మెట్ట భూమికి ఎకరాకు రూ. 5 వేలు కౌలు ఉంటుంది. కానీ మూడు ఎకరాల మాగానికి వచ్చే కౌలుకు సమానంగా మన ప్రభుత్వం పెన్షన్ సొమ్మును ఇస్తోంది. 10 ఎకరాల మెట్ట భూమికి వచ్చే కౌలుకు సమానంగా మన ప్రభుత్వం పెన్షన్ సొమ్మును అందిస్తోంది. అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారికి ఇంటి మనుషులు చాకిరీ చేయాల్సి ఉంటుంది. ఆదుకోవడానికి ఇబ్బంది పడతారు...అందుకే వారికి రూ. 5 వేల నుండి రూ. 15 వేలకు పెంచడం మా ప్రభుత్వానికి ఉన్న మానవత్వానిరి నిదర్శనం. ప్రతి కుటుంబానికి పెద్దకొడుకుగా ఉంటా...సంక్షేమంలో ఇది మొదటి అడుగు మాత్రమే.” అని సీఎం చంద్రబాబు అన్నారు.

**సమాజానికి చేయూతనివ్వడంలో ముందుంటా**

“ప్రకాశం బ్యారేజీకి నీళ్లు వస్తున్నాయంటే కారణం పట్టిసీమ. పోలవరం పూర్తైతే ప్రతి ఎకరాకు నీళ్లు వస్తాయి. అమరావతిని కూడా గత పాలకులు ఏ గతి పట్టించారో మీకు తెలుసు. అమరావతి పూర్తైతే ప్రతి ఒక్కరికీ ఉపాధి దొరుకుతంది. తవ్వుతున్న కొద్దీ నాటి ప్రభుత్వ తప్పులు అప్పులు బయటపడుతున్నాయి. వృద్ధులు, వికలాంగులు, గీత కార్మికులు, చేనేత, మత్స్యకార, ఒంటరి మహిళలు, హిజ్రాలు, డప్పుకళాకారులకు పెన్షన్ పెంచాం. విభిన్న ప్రతిభావంతులకు చేయూత ఇవ్వడం సమాజం బాధ్యత...అందులో ముందు నేనుంటా. సమాజానికి చేయూతనివ్వడానికి ముందడుగు వేస్తా. పెరుగుతున్న ధరలకు కళ్లెం వేయాల్సి ఉంది. ధరలు తగ్గిస్తే పేద కుటుంబాలకు వెసులుబాటు లభిస్తుంది. ఇంటి సమస్యల వల్ల గతంలో ముసలివాళ్లను భారంగా భావించేవాళ్లు...కానీ ఇప్పుడు నాలుగు రోజులు అదనంగా ఉన్నా పర్వాలేదనుకునే పరిస్థితి వస్తుంది. పెన్షన్ల పంపిణీలో భాగమైన సచివాలయ సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. సచివాలయ సిబ్బందితో పెన్షన్ల పంపిణీ చేతకాదన్న అడ్మినిస్ట్రేషన్ తోనే నేడు పెన్షన్లు పంపిణీ చేస్తున్నాం.” అని సీఎం చంద్రబాబు అన్నారు.

సంక్షేమాన్నిచ్చే ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

“ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఒకే రోజు 5 హామీలపై సంతకాలు చేశాను. డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంతకం పెట్టాను. రెండో సంతకం ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దుపై పెట్టాను. ఈ యాక్ట్ అమల్లోకి వస్తే మీ భూమి మీకు కాకుండా పోయేది. అందుకే రద్దు చేశాం. మూడవ సంతకం పెన్షన్ల అమలుపై చేశాను. నాలుగో సంతకం అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై పెట్టాను రూ. 5లకే కడుపునిండా అన్నం తినే రోజులు మళ్లీ రాబోతున్నాయి. త్వరలో 183 అన్న క్యాంటీన్లను పెట్టబోతున్నాం..మిగతా చోట్ల కూడా వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తాం. ఐదో సంతకం స్కిల్ సెన్సస్...ఉద్యోగాలు ఉన్నా నైపుణ్యం లేక యువతకు ఉద్యోగాలు రావడం లేదు. నైపుణ్య కేంద్రాలు పెట్టి ఎవరికి ఏ స్కిల్స్ అవసరమో నేర్పిస్తాం. మా ప్రభుత్వానికి మరింత శక్తినిస్తే మరింత సంక్షేమం అందిస్తుంది. మంచి ప్రభుత్వం ఉంటే అందరికీ అండగా ఉండి వెసులుబాటును కల్పిస్తుంది. గత ప్రభుత్వం సరిగా పాలన చేసి ఉంటే ఇప్పుడు ఈ సమస్యలు ఉండేవి కాదు. మాది ప్రజల ప్రభుత్వం...ప్రజా ప్రభుత్వం. నిరంతరం మీ కోసం పని చేస్తాం. నిండు మనసుతో మా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి.” అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**రాజధాని వస్తుందని విశాఖ వాసులు భయపడ్డారు**

“రాజధాని తరలిపోతుందని గతంలో ఇక్కడివారు బాధపడ్డారు...రాజధాని వస్తుందేమోనని విశాఖ వాసులు భయపడ్డారు. వైసీపీ నేతల భూ కబ్జాలు, శాంతిభద్రతలతో భయపడి దుష్టులు దూరంగా ఉండాలని ఉత్తరాంధ్ర వాసులు చిత్తుగా ఓడించారు. అధికారం ఉందని విర్రవీగితే ఏమవుతుందో గత పాలకుడికి పట్టిన గతిని చూస్తే తెలుస్తుంది. మహిళల వ్యక్తిత్వ హననం దెబ్బతినేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. గుంటూరులో రంగనాయకమ్మకు చెందిన శంకర్ విలాస్ లాక్కున్నారు...ఆమె చిన్న షాపు పెట్టుకుంటానన్నా అనుమతి ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో మోసం చేసి వైసీపీ నేతలు లాక్కున్న ఆస్తులన తిరిగి బాధితులకు అప్పగిస్తాం.” అని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

**పోలవరంను గోదావరిలో ముంచింది కాక...మళ్లీ అడ్డగోలు వాదనలు**

“పోలవరం ప్రాజెక్టులో భాగమైన డయాఫ్రం వాల్ ను నాడు జర్మన్ కంపెనీ టెక్నాలజీతో కష్టపడి రెండు సీజన్లలోనే నిర్మించాం. కానీ గత ప్రభుత్వం రెండేళ్లపాటు పట్టించుకోకపోవడంతో వరదల వల్ల డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాంలు దెబ్బతిన్నాయి. రూ. 440 కోట్లతో డయాఫ్రం వాల్ నిర్మిస్తే గత పాలకుల నిర్వాకం వల్ల దెబ్బతింది. కొత్తది మళ్లీ ఇప్పుడు నిర్మించాలంటే రూ. 990 కోట్లు ఖర్చు అవుతుంది. దీన్ని పరిశీలించేందుకు ఇప్పుడు విదేశాల నుండి నిపుణులు వస్తున్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో రూ. 600 కోట్లు మిగిల్చామని గత పాలకులు చెప్పారు..కానీ జరిగిన నష్టం రూ. 70 వేల కోట్లు...అది రూ. లక్షల కోట్లకు కూడా పెరుగుతుంది. దుర్మార్గులు గోదావరిలో పోలవరంను ముంచారు..మళ్లీ ఇప్పుడు అడ్డగోలు వాదనలకు దిగుతున్నారు.” అని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నేను చేసిన అభివృద్ధిని తర్వాత పాలకులు కొనసాగించారు**

“ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ లో నేను హైటెక్ సిటీ నిర్మిస్తే దాన్ని రాజశేఖర్ రెడ్డి కొనసాగించారు. రెండు మూడు ప్రాజెక్టులు తప్ప అన్నింటినీ రాజశేఖర్ రెడ్డి కొనసాగించారు. ఏపీలో రాజధాని అమరావతికి రైతులు భూములిచ్చారు..దానికి ప్రతిఫలం కేవలం కౌలు మాత్రమే ఇచ్చాం. అయినా అక్రమాలు జరిగాయని ముద్ర వేశారు. ఇల్లు కట్టుకోవడానికి నేను కూడా స్థలం వెతుక్కుంటుంటే భూ అక్రమాలు చేశానని కేసులు పెట్టారు. పిచ్చోడికి ఎవరిపై కోపం ఉంటుందో తెలీదు. అందుకే విధ్వంసం సృష్టించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన పరపతి ఢిల్లీలో కూడా ఉపయోగపడుతుంది. కులమతాలకు అతీతంగా సమర్థవంతమైన పాలన కావాలని ఆలోచించాలి. గత ప్రభుత్వంలో ఏ రోజైనా బయటకు వచ్చి ప్రజలతో ఒక్కసారైనా మాట్లాడారా.?” అని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు.

**అత్యాచారాలకు పాల్పడితే అదే చివరి రోజు :** “దళిత కుటుంబానికి చెందిన, గత ప్రభుత్వంలో బాధిత మహిళగా ఉన్న వంగలపూడి అనితను హోంమంత్రిని చేశాం. ఆడబిడ్డల జోలికి ఎవరొచ్చినా...మదంతో ప్రవర్తిస్తే ఎవరినీ వదిలిపెట్టను. ఎవరు అత్యాచారాలకు పాల్పడ్డా అదే చివరి రోజు అవుతుంది. పాలన ప్రారంభమైంది ఈ మధ్యనే కాబట్టి ఇప్పటిదాకా మర్యాదగా చెప్పా. మద్యం, గంజాయి మత్తులో ఏదిపడితే అది చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఆడబిడ్డలకు అన్యాయం జరిగిందని తెలిస్తే....తప్పు చేసిన వారిని ఎవర్నీ వదిలిపెట్టను.” అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

**మరోసారి పరదాలు కనబడితే సస్పెండే :** “నేను వెళ్లేదారుల్లో పరదాలు కట్టినట్లు మళ్లీ కనబడితే సస్పెండ్ చేస్తా. అధికారులు కూడా పాతరోజులు మర్చిపోయి కొత్త రోజుల్లోకి రావాలి. కొత్త శకానికి...కొత్త పాలనకు అందరూ అలవాటు పడాలి. పరదాలు కట్టాలన్న ఆలోచన వస్తే ఇక షాక్ ట్రీట్ మెంట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా. చెప్పిన దాని ప్రకారం నడుచుకోకపోతే మళ్లీ 1995 నాటి సీఎంను చూస్తారు. తప్పు చేస్తే ఎవర్నీ వదలను. ఎప్పుడూ జరగని అభివృద్ధిని మంగళగిరి నియోజకవర్గంలో చేసి చూపిస్తాం. రోడ్లు వేసేటప్పుడు ఎవరికైనా ఇబ్బందులు ఉంటే మాతో చెప్పండి..కోర్టులకు వెళితే పనులు ఆలస్యమవుతాయి. మా ప్రభుత్వం నిరంతరం మీ కోసమే ఆలోచిస్తుంది. రాష్ట్రంలో మంచి కార్యక్రమాలు అమలు చేయడానికి... పేదరికం లేని సమాజానికి పెనుమాక నుండే సంకల్పం తీసుకుంటున్నాం. నేను అందరి వాడిని...ఏ ఒక్కరి వాడిని కాదు. మీ గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించడానికి పనిచేస్తా. కొన ఊపిరి వరకూ ప్రజల కోసమే పోరాడుతా.” అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, కొండపల్లి శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రతీ రూపాయికీ జవాబుదారిగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

నిధులు ఏమయ్యాయో, ఎలా దారి మళ్లించారో కూడా అంతుపట్టడం లేదు. లోతుల్లోకి వెళ్లి సమీక్షిస్తుంటే అధికారులు చెబుతున్న విషయాలు విస్తుగొలిపేలా ఉంటున్నాయి. చిన్నచిన్న మరమ్మతులకు, నిర్మాణాలకు వారు పెట్టిన ఖర్చులు దారణంగా ఉన్నాయి. పంచాయతీరాజ్ లో చక్కగా పని చేసే అధికారులున్నాయి. వారిని సరైన రీతిలో ఉపయోగించుకోవడంలోనే తప్పులు జరిగాయి. వీటిని సరిదిద్దాలి. పంచాయతీరాజ్ లో పునరుత్తేజం నింపాలి. సమగ్రంగా వ్యవస్థకు జీవం పోయాలి.

**నా ఆఫీసుకి కొత్త ఫర్నిచర్ వద్దు... అవసరమైతే నేనే కొనుగోలు చేసుకొంటా**

సమీక్షల్లో భాగంగా ఒక్కో శాఖ ఆర్థికస్థితిని పరిశీలిస్తుంటే అప్పులు పేరుకుపోయి ఉన్నాయి. పంచాయతీరాజ్ లో జరిగిన నిధుల దుర్వినియోగం, మళ్లింపు.. ఆ ఫలితంగా నిధుల లేమిని వాస్తవంగా చూసిన తర్వాత నాకు జీతం వద్దని అధికారులతో చెప్పాను. తొలుత జీతం తీసుకొని పని చేస్తాను అని చెప్పాను. అయితే అప్పులతో మునిగిపోయిన శాఖ బాధ్యతలు చూస్తూ నేను జీతం తీసుకోవడం భావ్యం కాదు అనుకున్నాను. నా క్యాంపు కార్యాలయానికి సైతం అధికారులు చిన్నచిన్న మరమ్మతులు అవసరం అవుతాయని చెప్పినా, వద్దు అన్నాను. అప్పులు చేసి మరమ్మతులు చేయాల్సిన అవసరం లేదని చెప్పాను. కార్యాలయానికి కొత్త ఫర్నీచర్ కూడా పెట్టొద్దని చెప్పాను. నాకు ఏదైనా అవసరం అయితే నేనే ఫర్నిచర్ కొనుగోలు చేసి తెచ్చుకుంటాను. ప్రభుత్వం నుంచి మాత్రం ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదని చెప్పాను.

హంగులు, ఆర్భాటాలు కాకుండా నాశనం అయిన వ్యవస్థలను తిరిగి సరిదిద్దాలనే సంకల్పంతోనే పని మొదలుపెట్టాను. దాని కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తాను. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గురించి లోతుగా తెలుసుకుంటున్నాను. తర్వాత దాన్ని ఎలా సరిదిద్దాలనే విషయాలపై ఓ ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తాను. దేశంలోనే అత్యుత్తమంగా రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ ఉండాలనేది నా ప్రయత్నం.

**పొల్యూషన్ ఆడిట్ లెక్కలు తీస్తున్నాము**

రాజకీయాల్లోకి డబ్బు కోసమో, పదవి కోసమో నేను రాలేదు. ప్రజల కోసం పని చేయాలనే దృఢమైన సంకల్పంతో వచ్చాను. ప్రజలు ఆశీర్వదించి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారు. నాకు రాజకీయాల్లో డబ్బు అవసరం లేదు. నా సొంత డబ్బులను ఖర్చుపెట్టుకొనే రాజకీయాలు చేశాను.. ప్రజలకు సాయం అందించాను. ఇప్పుడు కీలకమైన శాఖలు చూస్తూ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వేళ ఒకటే చెబుతున్నాను. నా వైపు నుంచి అవినీతికి తావుండదు. దీనికి తగినట్లుగా అధికారులు పని చేయాలి. కీలకమైన పర్యావరణ శాఖను తీసుకున్నాం. దీనికి తగినట్లుగానే రాష్ట్రంలోని ఏ పరిశ్రమల నుంచి ఎంత మేర కాలుష్యం విడుదల అవుతుందనే ఆడిట్ లెక్కలు తీయిస్తున్నాం. పరిశ్రమల నిర్వాహకులే కాలుష్య నిర్యంత్రణ చర్యలు అవలంబించేలా చేయాలి. కాలుష్యం తగ్గించేందుకు ఉన్న అవకాశాలు, కాలుష్యరహిత పరిశ్రమలను ప్రోత్సహించేలా పని చేస్తాం.

**రుషికొండ తవ్వేసి రాజమహల్ కట్టారు**

అప్పుల్లో ఉన్న రాష్ట్రంలో రూ. 600 కోట్లు ఖర్చుపెట్టి రుషికొండను తవ్వేసి మరీ రాజమహల్ కట్టారు. ఇప్పుడు అది ఎందుకు పనికిరాకుండా అయింది. ఖర్చుపెట్టిన డబ్బంతా బూడిదలో పోసిన పన్నీరే అయింది. గత ప్రభుత్వంలోని పెద్దలు చెబుతున్నట్లు విదేశీ అతిథుల కోసం కట్టామని చెబుతున్నారు. వారి కోసం ఇంత ఖర్చు చేయాల్సిన అవసరం ఏమిటి..? వైసీపీ ప్రభుత్వంలో విశాఖలో కట్టిన రాజప్రసాదం డబ్బుతో ఓ జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమయ్యేది. ఓ జిల్లాకు పెట్టాల్సిన డబ్బు ఓ కోటకు పెట్టారు. ఇలాంటివి రాష్ట్రంలో ఎన్నో జరిగాయి. వాటిని తవ్వి బయటకు తీస్తుంటే విస్తుపోవడం మొదట మా వంతు అవుతుంటే... తర్వాత ప్రజల వంతు అన్నట్లు ఉంది. గత ప్రభుత్వంలో జరిగిన విచ్చలవిడి అక్రమాలకు తెరపడాలి. ప్రజలకు అవసరం అయ్యే మార్పులు అన్ని వ్యవస్థల్లో రావాలి.

కేంద్ర జల్ జీవన్ మిషన్ పథకం నిధులు కావల్సినన్ని ఉన్నాయి. ప్రతి ఇంటికీ తాగునీరు ఇవ్వాలనే ఆశయంతో జల్ జీవన్ మిషన్ పథకం ఉంటే, దాన్ని గత రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోలేకపోయింది. గోదావరి పక్కనే ఉన్నా తాగునీరు సరిగా లేని చాలా గ్రామాలున్నాయి. కొల్లేరు సరస్సు చెంతనే ఉన్నా మంచి నీరు దొరకని కైకలూరు వంటి ప్రాంతాలున్నాయి. కేంద్ర పథకాన్ని ఉపయోగించుకొని దాహార్తి తీర్చాల్సిన ప్రభుత్వం ఆ నిధులను తెచ్చుకోవడంలో వెనుకబడింది. కేంద్ర పథకాలకు రాష్ట్రం కూడా తగినంత మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వాలనే నిబంధన ఉంటుంది. ఒక్కో పథకానికి ఒక్కోలా ఆ గ్రాంటు ఉంటుంది. దాన్ని గత ప్రభుత్వం ఇవ్వక వేల కోట్ల రూపాయల నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. రూ. 200 కోట్లు, రూ. 400 కోట్లు ఇస్తే, వేయి కోట్లు వచ్చే అవకాశం ఉన్నా దాన్ని గత ప్రభుత్వం పట్టించుకోక కేంద్ర నిధులన్నీ ప్రజలకు అందకుండాపోయాయి. వివిధ కేంద్ర పథకాలకు రావల్సిన నిధులను గత ప్రభుత్వం చాలా వరకు తీసుకోలేకపోయింది.

**జవాబుదారీ పాలన అందిస్తాం**

పాలన చేతికొచ్చింది అద్భుతాలు జరిగిపోతాయి అని చెప్పలేను కానీ.. ప్రభుత్వంలో ఏ జరుగుతుందో సామాన్యుడికి అర్థం అయ్యేలా పాలన ఉంటుంది. పూర్తిగా గాడి తప్పిన వ్యవస్థలకు జీవం పోయాలి. పాలనలో జరుగుతున్న వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తాం. వారికి జవాబుదారీ పాలన అందిస్తాం. మంచినీరు, పారిశుధ్యం లేని గ్రామాలను తీర్చిదిద్దడానికి మొదటి ప్రాధాన్యం ఇస్తాను. దీనికోసం పిఠాపురంలోనే మొదటి మోడల్ గ్రామాన్ని తీర్చిదిద్దుతాం. భారతదేశంలోనే మోడల్ నియోజకవర్గంగా పిఠాపురాన్ని నిలపాలనేదే నా కోరిక. దీనికి పూర్తిస్థాయిలో పనిచేస్తాను. పరిశ్రమలు, ఉపాధి కల్పన కోసం ఎన్.ఆర్.ఐలతోనూ మాట్లాడుతున్నాను. నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి ఫోకస్ తో పని చేస్తాను.

**వాలంటీర్లు లేకపోతే పనులు కావు అన్నారు**

తాము నియమించిన వాలంటీర్లు లేకపోతే అసలు పింఛన్ల పంపిణీ అసాధ్యం అని గత ప్రభుత్వంలో ఉన్నవారు చెప్పారు. అలాంటిది ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా ఈ రోజు వాలంటీర్లు లేకుండా సచివాలయం సిబ్బంది, వివిధ శాఖల సిబ్బందిని ఉపయోగించుకొని ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ మొదలుపెట్టాం. సోమవారం సాయంత్రంలోగా పింఛన్ల పంపిణీ అయిపోతుంది. అరకొర మిగిలితే రేపు పూర్తి చేయాలని ఆదేశించాం. గత ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీ సమయంలో కొందరు వాలంటీర్లు లబ్ధిదారుల వద్ద రూ. 100 తక్కువ కాకుండా తీసుకునేవారనే ఫిర్యాదులు గతంలో నాకు వచ్చాయి. ఇప్పుడు పూర్తిస్థాయిలో ప్రభుత్వ సిబ్బందితోనే పింఛన్లు పంపిణీ చేయడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. వారు లబ్ధిదారుల వద్ద డబ్బు అడిగేందుకు అవకాశం కూడా ఉండదు. ఎందుకంటే వారు ప్రభుత్వ ఉద్యోగులు కాబట్టి బాధ్యత తీసుకుంటారు. వాలంటీర్లు లేకుండానే వ్యవస్థలతో పని చేయిస్తే ఎలా ఉంటుందో దీనివల్ల చేసి చూపించాం.

**తప్పు చేసిన వారికి శిక్ష పడాలి**

నేను, చంద్రబాబు గారు మాట్లాడుకుంటున్నపుడు రాష్ట్రంలో మొదట వ్యవస్థలను బలోపేతం చేయాలని సమష్టిగా అనుకున్నాం. ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలో వరుస తనిఖీలు చేస్తున్నపుడు బయటపడుతున్న అక్రమ రేషన్ బియ్యం వైసీపీ మాఫియా ఎంత బలంగా ఉందో చాటి చెబుతోంది. నేను ఎన్నికలప్పుడు కాకినాడ మాఫియా గురించి చెప్పాను. ఇప్పుడు తనిఖీల్లో భాగంగా వేల మెట్రిక్ టన్నుల అక్రమ రేషన్



బియ్యం బయటపడుతుంటే ప్రజలు కళ్లారా చూస్తున్నారు. రేషన్ బియ్యం కోసం ప్రభుత్వం రూ. 39లు రాయితీ భరిస్తోంది. ఆ సొమ్ము ప్రజలది. దాన్ని మాఫియా కొల్లగొడుతోంది. ప్రజాధనం ఎంత కొల్లగొట్టిందో మనోహర్ పరిశీలనలో బహిర్గతం అవడం విస్తుగొలిపింది.

ఇక కడపలో బైరెటీస్ గనులన్నీ గుల్ల చేసేశారు. అసలు కనివినీ ఎరుగని స్థాయిలో విధ్వంసం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులకు బాధ్యులకు శిక్ష పడాలి. అధికారులు కూడా అర్థం చేసుకోవాలి. మాది సాధింపుల ప్రభుత్వం కాదు. ప్రజల ఆకాంక్షలు సాధించే ప్రభుత్వం మాది. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను ప్రజలకు తెలియజెప్పాలి. ఆ బాధ్యత కూటమి ప్రభుత్వం మీద ఉంది.

**ప్రతీ రూపాయికీ సమాధానం చెప్పాలి**

నేను సినిమాల్లో వచ్చిన రెమ్యునరేషన్ అకౌంట్లను ఎప్పుడూ క్షుణ్ణంగా చూడలేదు. పన్ను ఎంత కట్టాలి..? ఎక్కడ సంతకం పెట్టాలి అని అడిగి ముగించేవాడిని. పాలనలోకి వచ్చాక ప్రజా ఖజానా నుంచి ఎంత మేర ప్రజాధనం వినియోగం అయింది.. పక్కదారి పట్టించారు... దుర్వినియోగం అనే అన్ని అంశాలను అధికారులు చెబుతుంటే గంటలకు గంటలు వాటిని పరిశీలిస్తున్నాను. వింటున్నాను. నాకున్న సందేహాలను మళ్లీ తీర్చాలని అధికారులను అడుగుతున్నాను. అధికారులు కూడా నన్ను వేరుగా అనుకోవద్దు. కచ్చితంగా ప్రజలకు చెందిన ప్రతి రూపాయికి సరైన సమాధానం చెప్పాలనే కాంక్షతోనే నేను ప్రతి విషయాన్ని తెలుసుకుంటున్నాను. రేపటి తరాలకు భరోసానిచ్చేలా బాటలు వేస్తాను” అన్నారు. ఈ సమావేశంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ జిల్లా కలెక్టరు షణ్మోహన్ సగిలి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ, పిఠాపురం నియోజక వర్గం జనసేన సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం బీజేపీ ఇంఛార్జి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణా వార్తలు

# బాబ్లీ గేట్లు ఓపెన్



- సుప్రీం ఆదేశాలు అమలు
- ఏటా జులై 1న గేట్లు తెరిచేలా ఆదేశాలు
- అక్టోబర్ 28 వరకు ఓపెన్‌లోనే
- మహారాష్ట్ర, తెలంగాణ అధికారుల సమక్షంలో నీరు విడుదల

**నాందేడ్( జర్నలిస్ట్ ఫైల్ ):** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ తాలూకాలో ఉన్న బాబ్లీ ప్రాజెక్టు మొత్తం 14 గేట్లను సోమవారం తెరిచారు. గోదావరిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు నుంచి మహారాష్ట్ర, తెలంగాణ ఇరిగేషన్ అధికారుల సమక్షంలో నీటిని విడుదల చేశారు. 80 కిలో మీటర్ల దిగువన ఉన్న ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టు అయిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్‌కు నీటిని వచ్చేలా చూసేందుకు ప్రతి సంవత్సరం జులై 1న ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయాలని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించింది. కాగా, అక్టోబర్ 28వ తేదీ వరకు గేట్లు ఎత్తే ఉంచాలని 2013 ఫిబ్రవరి 28న సుప్రీంకోర్టు బాబ్లీ ప్రాజెక్టుపై తీర్పు ఉంది. ఈ క్రమంలోనే శ్రీరాంసాగర్‌లోకి వరద ప్రవాహం పెరగనుంది. ఇప్పటికే గోదావరి పరివాహక ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేశారు. ప్రతి ఏడాది మహారాష్ట్ర అధికారులు సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నారు.

**భారీ వర్షాలతో పెరిగిన వరదనీరు..**

కాగా, ఈ వారం ఎస్సారెస్పీ పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి కాస్తా వరదనీరు వచ్చి చేరుతోంది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నుంచి వరద వచ్చి చేరుతోంది. బ్యారేజీకి 14,500 క్యూసెక్కుల మేర వరద రాగా.. జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచన మేరకు అన్ని గేట్లను ఎత్తి ఉంచారు. దీంతో వచ్చిన వరద వచ్చినట్లుగా దిగువకు వెళ్లిపోతోంది. వరద రావడంతో తాత్కాలిక పనుల కోసం తెచ్చిన యంత్రాలు, సామగ్రిని తరలించారు. ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

# ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అరెస్ట్



**జనగామ ( జర్నలిస్ట్ ఫైల్ ):** జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. గాంధీలో దీక్ష చేస్తున్న మోతీలాల్‌ను కలిసేందుకు ఆయన రావడంతో అందుకు అనుమతి లేదంటూ ఆయనను అదుపులోకి తీసుకున్నారు.. అనంతరం బొల్లారం పీఎస్‌కు పోలీసులు తరలించారు. ఇది ఇలా ఉంటే గాంధీ ఆస్పత్రిలో ఉద్యోగ నోటిఫికేషన్లపై నిరుద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి వారం రోజులుగా ఆస్పత్రిలోనే విద్యార్థి నేత మోతీలాల్ నాయక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు.. దీక్ష విరమించమని బిఆర్ఎస్ నేతలు కోరినా అందుకు అయన అంగీకరించలేదు.

# స్వార్థ రాజకీయాలకే పార్టీలు మారుతున్నారు : కేటీఆర్



**జగిత్యాల ( జర్నలిస్ట్ ఫైల్ ):** స్వార్థ రాజకీయాలకే కొందరు ఎమ్మెల్యేలు పార్టీలు మారుతున్నారని, పార్టీ ఫిరాయింపులను మొదలు చేసిందే కాంగ్రెస్ పార్టీ అని, గాలికి గడ్డి పోసలే ఎగిరిపోతాయని, బిఆర్ఎస్ కార్యకర్తలు గడ్డపార లాంటి వారిని, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కు దమ్ముంటే రాజీనామా చేసి, మళ్లీ ఎమ్మెల్యేగా గెలవాలని, జగిత్యాలకు పట్టిన శని పోయిందని, బిఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించిన జగిత్యాల బిఆర్ఎస్ పార్టీ నాయకుల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు గుర్తుపై గెలిచి పార్టీ మారిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తన స్వార్థానికి పార్టీ మారారని, జగిత్యాలకు పట్టిన శనిపోయిందని, కష్టకాలంలోనే మనుషుల విలువ తెలుస్తుందని, గాలికి గడ్డి పూసలే ఎగిరిపోతాయని గడ్డపారలు ఎగిరిపోవన్నారు. జగిత్యాల ప్రజలు ఎమ్మెల్యేగా ఎమ్మెల్యేగా గెలిపిస్తే రేవంత్ రెడ్డి వేసే ఎంగిలి మెతుకుల కోసం ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారారని, ఇప్పుడు జగిత్యాల అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు ఎమ్మెల్యే మాట్లాడుతున్న మాటల్లో వాస్తవం లేదని, జగిత్యాలను జిల్లా చేసి మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామని, రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా జగిత్యాలలో 4520 డబల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించామని, గత పది ఏళ్లలో జగిత్యాలను ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామన్నారు.

ఎమ్మెల్యే సంజయ్ తన స్వార్థ ప్రయోజనాల కోసమే పార్టీ మారారని, సంజయ్ కు దమ్ముంటే ఎమ్మెల్యేగా రాజీనామా చేసి మళ్లీ ఎమ్మెల్యేగా గెలవాలని సవాల్ విసిరారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది కాంగ్రెస్ పార్టీయేనని, నాడు ఇందిరాగాంధీ హయాంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్లో చేర్చుకున్నారని గుర్తు చేశారు. 2014లో కాంగ్రెస్ మెడలు వంచి స్వరాష్ట్ర తెలంగాణను సాధించామని, బిఆర్ఎస్ పార్టీ ఒక్కొక్క ఎమ్మెల్యేను చేర్చుకోలేదని, రాజ్యాంగబద్ధంగానే 2/3 శాతం ఎమ్మెల్యేలు పార్టీలో చేరారని గుర్తు చేశారు. ఎన్నికల కంటే ముందు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరితే రాళ్లతో కొట్టి చంపాలని మాట్లాడారని, ఇప్పుడు ఎవరిని రాళ్లతో కొట్టాలో చెప్పాలన్నారు. కాంగ్రెస్లో చేర్చుకున్న ఆరుగురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి కి సవాల్ విసిరారు.

పార్టీ ఫిరాయిస్తే సభ్యత్వాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలు పేర్కొందని, ఇప్పుడు ఇతర పార్టీ ఎమ్మెల్యేలను ఇలా చేర్చుకుంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నోటికి వచ్చిన హామీలు ఇచ్చిందని, గత ప్రభుత్వ అమలు చేసిన రైతుబంధు, పెన్షన్ల సంక్షేమ పథకాలను సైతం అమలు చేయడం లేదని, ఉచిత కరెంట్ అని చెప్పి కరెంటు లేకుండా చేస్తున్నారన్నారు. గొర్రెలు, బర్రెలు కొన్నట్లుగా ఎమ్మెల్యేలను కాంగ్రెస్లో చేర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 14 స్థానాల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి చెందామని, బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే ముఖ్య బలమని, మధ్యలో వచ్చిన నాయకులు మధ్యలో వెళ్లిపోయారని, పార్టీకి కార్యకర్తలు ముఖ్యమని, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అధైర్య పడకుండా ధైర్యంతో ఉండాలన్నారు.

8 నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, రానున్న రోజుల్లో ప్రజలు కాంగ్రెస్కు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యకర్తలు ఎవరు భయపడకుండా బాధపడకుండా ఉండాలని, కార్యకర్తలు అందరికీ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. రాజకీయాల్లో హత్యలు ఉండవని ఆత్మహత్యలే ఉంటాయని, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పార్టీ మారి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సమాజం చీలిందని, దేశంలో బలమైన రాజకీయ పార్టీలు ఉన్నాయని, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పలు పార్టీలకు అనుకున్న ఫలితాలు రాలేదని, బిఆర్ఎస్ పార్టీకి పోరాటం కొత్త కాదని, నిత్యం ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.

ఈ సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, కోరుకంటి చందర్ , జడ్పీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, నాయకులు చిన్నమనేని లక్ష్మీనరసింహారావు, సర్దార్ రవీందర్ సింగ్, శ్రీకాంత్ రెడ్డి, వివిధ మండలాల జడ్పిటిసిలు, ఎంపీపీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుద్యోగులను వెంటాడిన పోలీసులు

- మీడియాపై పోలీసుల దౌర్జన్యం



**హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** నిరుద్యోగుల సమస్యపై ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్‌కు మద్దతుగా గాంధీ ఆస్పత్రి వద్దకు తండోపతండాలుగా నిరుద్యోగులు చేరుకున్నారు. అయితే.. సోమవారం గాంధీ హాస్పిటల్ మెయిన్ గేటు వైపు నిరసనగా వచ్చిన నిరుద్యోగులను పోలీసులు భయభ్రాంతులకు గురి చేశారు. నిరుద్యోగుల వైపు పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు దూసుకెళ్లి వెంబడించారు. దీంతో నిరుద్యోగ యువతీయువకులు అక్కడున్న మెట్రో స్టేషన్లోకి పరుగెత్తారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులపై పోలీసుల తీరు సరిగా లేదని నిరుద్యోగులు మండిపడ్డారు.

**అడుగడుగునా అడ్డగింపు..**

మరోవైపు గాంధీ మెడికల్ కాలేజీ హాస్టల్ భవనాల వైపు నుంచి కొంత మంది విద్యార్థులు గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలోకి చేరుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు హాస్టల్ భవనాల వద్ద ఉన్న క్యాంటీన్ వైపు వెళ్లి నిరుద్యోగులను అడ్డుకున్నారు. డీఎస్సీ వాయిదా వేయాలంటూ నిరుద్యోగులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సమయంలోనే కవరేజ్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. అనంతరం నిరుద్యోగులను పోలీసులు చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత వారిని బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇక గాంధీ ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో నిరుద్యోగుల నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తామన్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

**మీడియాపై పోలీసుల దౌర్జన్యం**

హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్ లో కవరేజ్‌కు వెళ్లిన మీడియా ప్రతినిధులపై పోలీసులు దౌర్జన్యం చేశారు. ఓ కెమెరామెన్‌పై అక్కడ డ్యూటీలో ఉన్న ఎస్ఐ అత్యుత్సాహం ప్రదర్శించారు. కెమెరామెన్‌ను నెట్టిపడేశారు. అంతేకాకుండా ఓ మహిళా జర్నలిస్టుతో కూడా మరో పోలీసు అధికారి వాగ్వాదానికి దిగారు. దీంతో మీడియా ప్రతినిధులు పోలీసుల తీరుపై మండిపడ్డారు. మీడియాను అడ్డుకోవడం ఏంటని నిలదీశారు. పోలీసుల తీరు సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తంగా గాంధీ ఆస్పత్రి వద్ద స్థానిక పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలను మోహరించారు. గాంధీ ఆస్పత్రిలోకి వెళ్లే ప్రతి ఒక్కరిని తనిఖీ చేసిన తర్వాతే హాస్పిటల్‌లోకి పంపిస్తున్నారు పోలీసులు. మీడియాను మాత్రం హాస్పిటల్‌లోకి అనుమతించడం లేదు.

## తెలంగాణలో 8 మంది ఐపీఎస్‌ల బదిలీ

**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ):** నేడు తెలంగాణలో 8 మంది ఐఫీఎస్ అధికారులు బదిలీ అయ్యారు.. ఈ మేరకు సోమవారం డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

**బదిలీ అయిన వారి వివరాలు** : హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా సుభాష్. కొత్తగూడెం ఓఎస్‌డీగా పరితోష్ పంకజ్, ములుగు ఓఎస్‌డీగా మహేష్ బాబా సాహెబ్, గవర్నర్ ఓఎస్‌డీగా సిరిశెట్టి సంకీర్త్, భద్రాచలం ఏఎస్పీగా అంకిత్ కుమార్, భైంసా ఏఎస్పీగా అవినాష్ కుమార్, వేములవాడ ఏఎస్పీగా శేషాద్రిని రెడ్డి, ఏటూరు నాగారం ఏఎస్పీగా శివమ్ ఉపాధ్యాయ.

## ప్రజావాణిలో రైతు ఆత్మహత్యాయత్నం



**గద్వాల ( జర్నలిస్ట్ ఫైల్ ):** కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జోగులాంట గద్వాల జిల్లాలో చోటుచేసుకుంది. అల్లంపూర్ నియోజకవర్గం, ఐజా మండలం, గుడిదొడ్డి గ్రామంలో రైతు పరశు రాముడుకు చెందిన సర్వే నంబర్ 321లో 5ఎకరాల భూమిని ఇదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేశారని, ఈ విషయాన్ని ఐజా తహసీల్దార్ కు, జిల్లా కలెక్టర్ కు పలు సందర్భాల్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరు కూడా పట్టించుకోకపోవడంతో ఇవాళ కలెక్టర్ కార్యాలయం ప్రజావాణి ముందు రైతు పరశురాముడు తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అక్కడే ఉన్న పోలీసులు గమనించి రైతు పరశురాముడును హాస్పిటల్‌కు తరలించారు. ఆయనకు సంబంధించిన ఐదు ఎకరాల భూమిని ఇదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేయడంతో, పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించానని, తమకు న్యాయం జరగలేదంటూ రైతు పరశురాముడు వీరి కుటుంబ సభ్యులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. పురుగుల మందు తాగిన రైతు పరశురాముడిని పోలీస్ బైక్ పై హాస్పిటల్ కు తరలించారు.

# రాజ్యసభలో మోదీపై విరుచుకుపడ్డ ఖర్గే

**ఢిల్లీ :** ప్రదాని మోదీ ఎన్నిక లప్రచారంలో అబద్ధాలు చెప్పారని ధ్వజమెత్తారు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే. నోటికొచ్చినట్లు అబద్ధాలు ప్రచారం చేశారని మండిపడ్డారు. కుల,మత , భాషా పరంగా విద్వేషాలు రెచ్చగొట్టారన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు మోదీ 200లకు పైగా స్పీచ్ లు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ117 కు పైగా స్పీచ్ లపై ఈసీకి కంప్లైంట్ చేశాం.. ఈసీకి కంప్లైంట్ ఇచ్చినా పట్టించుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు ఖర్గే.

రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదం తీర్మాన చర్చ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ, సామెతలు, సెటైర్లతో ప్రధానిపై కౌంటర్ అటాక్ చేశారు. ఎన్నికల ముందు విపక్షాల అకౌంట్లు ఫ్రీజ్ చేసి.. ఎన్నికల ప్రచారాన్ని ఎన్నో రకాలుగా అడ్డుకోవాలని చూశారని విమర్శించారు. విపక్షాలను అణగదొక్కడం మోదీకి అలవాటుగా మారిందన్నారు. చందా దేవో..దందా ఖరో మోదీ నినాదంగా మారిందని ఎద్దేవా చేశారు. ఈడీ, సీబీఐ, ఐటీలను ఇష్టం వచ్చినట్లు వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వాలను పడొట్టడం, నేతలను కొనుగోలు చేయడం కామన్ అయిపోయిందన్నారు. మహారాష్ట్ర, గోవా,మణిపూర్ లో ప్రభుత్వాలను పడగొట్టలేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ లను అక్రమంగా అరెస్ట్ చేశారని అన్నారు. కేజ్రీవాల్ కు ఒక కేసులో బెయిల్ వస్తే..మరో కేసులో అరెస్ట్ చేశారని అన్నారు.

పొత్తులను అపహస్యం చేసిన మోదీ..ఇపుడు పొత్తులపైనే ఆధారపడ్డారని అన్నారు. మోదీ సినిమాలో అన్ని లీకేజీలేనని సెటైర్ వేశారు. నీట్ పేపర్ లీక్, నీట్ నీట్ పీజీ రద్దు, అయోధ్య రామాలయంలో లీక్ ..ఏటా 20లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మూడేళ్ల కాలంలో 70 సార్లు పేపర్ లీక్ జరిగిందని మండిపడ్డారు ఖర్గే. అయితే ఖర్గే వ్యాఖ్యలను కేంద్రమంత్రి నడ్డా తప్పుబట్టారు. ప్రధాని మోదీపై, కేంద్రంపై ఖర్గే ఇష్టానుసారంగా విమర్శలు చేయడం కరెక్ట్ కాదన్నారు నడ్డా. దీనిపై కూడా ఖర్గే మాట్లాడుతూ, తాను మాట్లాడింది తప్పని నిరూపించమంటూ నడ్డాకు సవాల్ విసిరారు.



# శివుని ఫోటో చూపిస్తూ.. రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు




**ఢిల్లీ :** శివుని ఫోటో చూపిస్తూ.. రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలుకాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీని, బీజేపీని టార్గెట్ చేసుకొని విమర్శనాస్త్రాలు సంధించారు. శివుని ఫోటో చూపిస్తూ.. తమని తాము 24 గంటలపాటు హిందువులమని చెప్పుకునేవారిలో హింస, ద్వేషం, అసత్యం కురుకుపోయి ఉంటుందని.. బీజేపీని ఉద్దేశిస్తూ విమర్శించారు. హిందూ మతం పేరు చెప్పి బీజేపీ అందరినీ భయపెడుతోందని ఆరోపణలు చేశారు. తమని తాము హిందువులని ప్రచారం చేసుకునేవారు విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, అలాంటి వాళ్లు హిందువులే కారని విమర్శించారు. అసలు హింసని ప్రేరేపించే వాళ్లను హిందువులని ఎలా అనగలమని ప్రశ్నించారు.

**ప్రధాని మోదీ అభ్యంతరం**

ఈ విధంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో తీవ్ర దుమారం రేగింది. స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ లేచి అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకొని.. ఈ విషయం ఎంతో తీవ్రమైందని, హిందూ సమాజాన్ని హింసాత్మకమని పేర్కొనడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు రాహుల్ బదులిస్తూ.. “నరేంద్ర మోదీ ఒక్కరే మొత్తం హిందూ సమాజం కాదు, అలాగే ఆర్ఎస్ఎస్ ఒక్కటే హిందూ సమాజం కాదు” అని చెప్పుకొచ్చారు. తాను కేవలం ప్రధాని మోదీని, బీజేపీని, ఆర్ఎస్ఎస్‌ని ఆ వ్యాఖ్యలు చేశానని.. మొత్తం హిందూ సమాజాన్ని ఉద్దేశించి కాదని స్పష్టం చేశారు.

**శివుని ఫోటో నిషేధమా?**

అంతకుముందు.. రాహుల్ గాంధీ శివుని విగ్రహం చూపించడంపై కూడా సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. సభలో ప్లకార్డ్‌లు, ఫొటోలు ప్రదర్శించడం నిషేధం అని తేల్చి చెప్పారు. ఇందుకు రాహుల్ బదులిస్తూ.. ఈ సభలో శివుని బొమ్మని చూపించడం నిషేధమా? అని పదే పదే ప్రశ్నించారు. తన మెడకు పాము చుట్టిముట్టినప్పుడు తాను వాస్తవాన్ని అంగీకరిస్తానని శివుడు చెప్పాడని, ఆయన చేతిలో ఉన్న త్రిశూలం అహింసకు ప్రతీక అని వివరించారు. ఒకవేళ హింసకి ప్రతీక అయితే.. ఆ త్రిశూలం కుడిచేతిలో ఉండేదని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు.

**శివుడే ప్రేరణ** : తాను శివుని నుంచే ప్రేరణ పొందానని, ప్రతిపక్షంలో ఉన్నందుకు గర్వపడుతున్నానని రాహుల్ పేర్కొన్నారు. రాజ్యాంగానికి రక్షణగా ఉంటామని, అధికారం కంటే నిజం గొప్పదని చెప్పారు. రాజ్యాంగంపై దాడి జరుగుతోందని.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈడీ, సీబీఐ తమ ఇండియా కూటమి నేతలను వేధింపులకు గురి చేస్తున్నాయని ఆరోపణలు గుప్పించారు. తన ఎంపీ పదవితో పాటు ఇంటిని సైతం లాక్కున్నారని.. ఈడీ నుంచి 55 గంటల విచారణ ఎదుర్కున్నానని తీవ్రంగా మండిపడ్డారు.

## జాతీయ వార్తలు

## చలామణిలో రూ.7వేల కోట్లకు పైగా రూ.2,000 నోట్లు

**ఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఇప్పటికీ రూ. 7,581 కోట్ల విలువైన రూ. 2,000 నోట్లు చలామణిలో ఉన్నాయని ఆర్‌బిఐ సోమవారం వెల్లడించింది. గతేడాది మే19న రూ. 2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్లు ఆర్‌బిఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. మొత్తం రూ. 3.56లక్షల కోట్లు చలామణిలో ఉండగా .. ఈ ఏడాది జూన్ 28 నాటికి రూ. 7,581 కోట్లకు తగ్గిందని పేర్కొంది. గతేడాది మే 19 నాటికి చలామణిలో ఉన్న నోట్లలో 97.87 శాతం తిరిగి వచ్చాయని ఆర్‌బిఐ పేర్కొంది. రూ. 2,000 నోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతున్నాయని తెలిపింది.




# ఇకపై బాధితులకు సంపూర్ణ న్యాయం.. కొత్త న్యాయ చట్టాలపై అమిత్ షా



**ఢిల్లీ:** దేశ వ్యాప్తంగా జులై 1 నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమల్లోకి రావడంపై కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఇకపై బాధితులకు సత్వర, వేగవంతమైన న్యాయం జరుగుతుందని అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. “స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్ల తరువాత స్వదేశీ న్యాయ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు. వలస రాజ్యాల చట్టాల స్థానంలో భారత పార్లమెంటు రూపొందించిన ఈ చట్టాలు ఎన్నో రకాలుగా ఆలోచించి తెచ్చినవి. ఈ చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుంది. ఇప్పటి వరకు ఉన్న పోలీసుల హక్కులతో పాటు బాధితుల, ఫిర్యాదుదారుల హక్కులు కూడా రక్షించబడతాయి” అని షా వెల్లడించారు.

**కొత్త చట్టాల గురించి..** బ్రిటిష్‌కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) ఇక మీదట భారతీయ న్యాయ సంహితగా (బీఎన్ఎస్), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్పీసీ) భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)గా, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఎస్)గా మారనున్నాయి. అయితే, వివిధ వర్గాల నుంచి నూతన చట్టాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వీటి అమలును నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఇప్పటికే ఓ పిటిషన్ దాఖలైంది.

గత ఏడాది డిసెంబరులో సదరు చట్టాల తాలూకు బిల్లుల ఆమోదం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభల నుంచి ఏకంగా 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారని, చర్చ జరపకుండానే బిల్లులను ఆమోదించారని పిటిషనర్లు అంజలీ పటేల్, ఛాయామిశ్రా పేర్కొన్నారు. ప్రజల నుంచి కూడా ఈ కొత్త చట్టాలపై అభిప్రాయాలను సేకరించలేదన్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు.

## ఇప్పుడు అవకాశం వచ్చింది... ప్రత్యేక హెూదా తీసుకురండి



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** తమకు ప్రత్యేక హెూదా కావాలని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తీర్మానం చేసి ప్రధాని మోదీ ముందు పెట్టారని, కానీ ఏపీ సీఎం చంద్రబాబు మాత్రం ప్రత్యేక హెూదాపై ఇప్పటి వరకు నోరు ఎందుకు మెదపడం లేదని ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వంలో కింగ్ మేకర్‌గా ఉన్న చంద్రబాబు హెూదా విషయంలో సైలెంట్‌గా ఎందుకున్నారని, ఈ విషయంలో ఆయన ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాజధాని లేని రాష్ట్రంగా బీహార్ కంటే ఏపీ వెనుకబడి వుందని, హెూదా కావాలని 15 ఏళ్లు అడిగిన విషయం మీకు గుర్తులేదా? అని చంద్రబాబును షర్మిల ప్రశ్నించారు. "రాష్ట్రాభివృద్ధిలో ఏపీ 20 ఏళ్లు వెనకబడిందని చెప్పింది మీరే కదా. హెూదా ఇవ్వకుంటే మద్దతు ఉపసంహరిస్తామని ఎందుకు అనడం లేదు. మోసం చేసిన మోదీతో హెూదాపై సంతకం ఎందుకు పెట్టించలేరు? ప్రత్యేక హెూదాపై మీ వైఖరి ఏంటో చెప్పాలి. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రం ముందు హెూదా డిమాండ్‌ను పెట్టాలి" అని చంద్రబాబును కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని షర్మిల తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ప్రత్యేక ప్యాకేజీలు కాదని, రాష్ట్రాభివృద్ధికి హెూదా ఒక్కటే మార్గమని మరోమారు గుర్తుచేస్తున్నట్టు షర్మిల పేర్కొన్నారు.

## పెన్షన్ పంపిణీలో సచివాలయ ఉద్యోగి చేతివాటం



**పల్నాడు (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీలో ఊరూవాడా పెన్షన్ల పంపిణీతో ఓవైపు పండగ వాతావరణం నెలకొంటే.. మరోవైపు పెన్షన్ల విషయంలో ఓ సచివాలయ ఉద్యోగి చేసిన నిర్వాకంతో అంతా అవాక్కవ్వాల్సి వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నేటి నుంచి పెన్షన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఉదయం నుంచి వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లను పంపిణీ చేస్తున్నారు.

అయితే పల్నాడు జిల్లాలో మాచర్లలో మాత్రం పెన్షన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించారు. మాచర్ల 9వ వార్డు సచివాలయం వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ మూడావత్ వాలు నాయక్ పెన్షన్‌దారుల వద్ద నుంచి కమిషన్ పేరుతో రూ. 500 మేరకు వసూలు చేశాడు. విషయం తెలిసిన మున్సిపల్ కమిషన్.. సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకున్నారు. పెన్షన్ల పంపిణీలో కమీషన్ తీసుకున్నందుకు గాను వాలు నాయక్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు మాచర్ల మున్సిపల్ కమిషనర్ ప్రకటించారు.

## తిరుపతి జిల్లా, పీలేరులో ఉద్రిక్తత



**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్):** పీలేరులో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్లను గుర్తు తెలియని వ్యక్తులు చించేసారు. అయితే వైసీపీ అల్లరి మూకలే బ్యానర్లను చించి ఉంటారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. బ్యానర్లు చించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కాగా పీలేరు నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి నాయకులు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు. నాలుగు రోజుల క్రితం తన స్వగ్రామం నగిరిపల్లెకు ఎమ్మెల్యే రావడంతో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నల్లారి అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నగిరిపల్లికి వచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురావడంతో సానుకూలంగా స్పందించిన ఆయన పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలుకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

## రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం కనిపిస్తోంది ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం ( జర్నలిస్ట్ ఫైల్ ): రాష్ట్ర వ్యాప్తంగా ఇవాళ ఒక పండుగ వాతావరణం కనిపిస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. ఆత్మకూరు మండల కేంద్రంలో పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ జరిగింది. ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీ పార్థసారథి పింఛన్లు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు 7 వేల రూపాయలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరి కళ్లలో ఇవాళ ఆనందం కనిపిస్తోందని పరిటాల సునీత అన్నారు. 35 రూపాయల నుంచి 4000 వరకు పింఛన్లు తీసుకెళ్లింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. గత ప్రభుత్వంలో అర్హత లేకుండా చాలామంది పింఛన్ తీసుకున్నారన్నారు. అర్హత ఉన్న చాలామందికి పింఛన్లు తొలగించారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్ అందుతుందని పరిటాల సునీత తెలిపారు.



# అమ్మో.. అవినీతి రాజు !

గుంటూరు ఎస్ ఈ బి లో అవినీతి తిమంగళం

అవినీతి సంపాదన నెలకు రూ.4 లక్షలా ల పైనే !

లంచం ఇస్తే ఓకే, లేదంటే కేసే

తిలాపాపం తలాపిడికెడు అనే చందాన సాగుతున్న భాగోతం

( కూరపాటి విజయ్ బాబు , రిజనల్ క్రైం బ్యూరో , జర్నలిస్ట్ ఫైల్ )

**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ).** ఆయన ఓ బాధ్యత కలిగిన పోలీస్ ఉద్యోగి. ప్రజల నుండి ప్రభుత్వాలు వసూలు చేసిన సొమ్మును జీతం రూపంలో ప్రతినెలా తీసుకుంటున్నప్పటికీ అయ్యోరికి సరిపోవట్లేదంట! దొడ్డి దారిన అక్రమార్జనకు పాల్పడుతూ తన సొంత అవినీతి సామ్రాజ్యాన్ని నెలకొల్పుకున్నాడు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ అవినీతి అక్రమాలు జరిగిన రెక్కలు కట్టుకొని వాలి స్వయానా సెటిల్మెంట్ చేసుకునే స్థాయికి ఎదిగి నెలకు లక్షల రూపాయల అవినీతి సొమ్మును పోగేసుకునే స్థాయికి ఎదిగాడు.

దీంతో గుంటూరు జిల్లా పోలీస్ శాఖలో ఈ 'అవినీతి రాజు' వ్యవహార శైలిపై ప్రస్తుతం వాడివేడి చర్చ సాగుతోంది. వక్రమార్గంలో పోగు చేసుకున్న అక్రమ సొమ్మును ఉన్నతాధికారులకు సపర్యలు చేయటంలో ఉపయోగిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. సపర్యలు చేసి ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకున్న తర్వాత తన అవినీతి సామ్రాజ్యంపై మరక పడకుండా చూసుకోవడంలో 'అవినీతి రాజు' తెలివితేటలు మెచ్చుకోక తప్పదని అయ్యోరి సంగతి తెలిసినోళ్లంతా ముక్కున వేలేసుకుంటున్నారు.

గుంటూరు ఎస్ ఈ బి లో విధులు నిర్వర్తించే ఓ పోలీసు ఉద్యోగి అవినీతి అక్రమాలకు పాల్పడుతూ తనకు తానే స్థిరమైన అనినీతి సామ్రాజ్యాన్నిఆ శాఖలో ఏర్పరచుకున్నాడని తోటి ఖాకీల మధ్య గుసగుసలు జోరుగా వినిపిస్తున్నాయి . గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను తాము,తమ ప్రభుత్వం చేయదని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగా ప్రస్తుత పాలన సాగిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం కంట ఇలాంటి అవినీతి తిమ్మంగాలాలు కనపడకపోవడం ప్రస్తుతం చర్చకు దారి తీసింది.

టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్ రాసుకున్న ఎర్ర పుస్తకములో ఈయన గారి పేరు ఉండే ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఇటీవల ఎర్ర పుస్తకం తెరచిన లోకేష్ ఇలాంటి అధికారులపై ఏ విధమైన చర్యలు తీసుకుంటారోననే ఖాకీలు ఉత్కంతతో ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో అక్రమ మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలు, తదితర ప్రమాదకరమైన మత్తు పదార్థాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకునే దిశగా ఎన్డీఏ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను జరగనీయకుండా అన్ని శాఖలను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. అయితే గుంటూరు ఎస్ ఈ బిలో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తించే ఓ 'అవినీతి రాజు' వ్యవహారం శృతిమించి వేధింపులు అధికమవుతుండడంతో సిబ్బంది అంతర్గత సంభాషణల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ 'అవినీతి రాజు' గారు చేసే అవినీతి అక్రమాల మకిలి తమకు కూడా అంటుతుందనే భయం లో సహ ఉద్యోగులు కుట్టుమిట్లాడుతున్నట్లు తెలుస్తోంది. అక్రమ ఇసుక, రవాణా, గంజాయి, మాదకద్రవ్యాలు, మద్యం తదితర వాటిని అరికట్టేందుకు ఎస్ ఈ బీ కి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారాలను కట్టబెట్టింది. ఎస్ ఈ బీలో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న ఆ 'అవినీతి రాజు' అడిగినంత లంచం ఇవ్వకపోతే తానే స్వయంగా పోలీస్ స్టేషన్ కు తరలించి కేసులు నమోదు చేయించి చర్యలు తీసుకునేలా వ్యవహరిస్తాడని నానుడి నిలువెల్లా వ్యాప్తి చెందుతోంది.

ఇసుక అక్రమ రవాణా వాహనాలకు చెందిన యజమానులు ఈ 'అవినీతి రాజు' గారి ఆశీర్వాదం తీసుకుంటేనే... వాహనాలు రహదారి మీద తిరుగుతాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఆయా వాహనాలు యజమానులు ప్రతినెల మామూలు ఇస్తేనే ఈ 'అవినీతి రాజు' గారు ఆ వాహనాలను రోడ్డుపై తిరగనిస్తారని లేదంటే... ప్రత్యక్షంగా పట్టుకొని సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయించి అప్పజెబుతాడనే ప్రచారం జరుగుతోంది. ఒప్పందం ప్రకారం యజమానుల నుండి ఏ ఒక్క నెల మామూలు రాకపోయినా నిర్ద్వందంగా అక్రమ రవాణా వాహనాలను స్వయానా నిలుపుదల చేసి పోలీస్ స్టేషన్లకు తరలిస్తాడని వాదన బలంగా వినిపిస్తోంది. ఇలా ఎన్నో వాహనాలను గత ఐదు సంవత్సరాలలో గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్లలో అప్పచెప్పినట్లు సమాచారం.

ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల చిట్టా విప్పితే 'అవినీతి రాజు' గారి భాగోతం బయటపడుతుందని పేర్కొంటున్నారు. మరోవైపు గంజాయి రవాణా అమ్మకం దారుల వద్ద నుండి కూడా ప్రతి నెల లక్షల రూపాయల్లో మామూలు పుచ్చుకుంటున్నట్లు ఈ 'అవినీతి రాజు' పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గుట్కా,పాన్ మసాలాలు నిషేధం ఉన్న సమయంలో సరఫరాదారుల వద్ద నుండి, విక్రేతల వద్ద నుండి భారీ స్థాయిలో లంచాల ముడుపులు పుచ్చుకొని.., వారిని గాలికి వదిలేసాడనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికే ప్రతి నెల వివిధ రూపాల్లో ఈ లంచగొండి పోలీసు ఉద్యోగికి ప్రతినెల 4 లక్షల రూపాయలు అక్రమ సంపాదన వచ్చి పడుతోందని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులను ప్రసన్నం చేసుకునేందుకు పోలీసు ఉన్నతాధికారులకు సపర్యలు చేసి వారిని సైతం తన మార్గంలోకి తెచ్చుకుంటాడనే వాదన బలంగా వినిపిస్తోంది. దీంతో అయ్యగారి ప్రసన్నాలకు, ప్రసాదాలకు రుచి మరిగిన ఉన్నతాధికారులు 'అవినీతి రాజు' పై చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ 'అవినీతి రాజు' పై చర్యలు తీసుకోవాలంటే పోలీసు ఉన్నతాధికారులు భయపడు తున్నట్లు తెలుస్తోంది.

కాగా ఇతగాడి అక్రమ వసూళ్ల దందాపై చర్యలు తీసుకునే దమ్మున్న అధికారి ఆ శాఖలో లేరనే ప్రచారం సాగుతోంది. ఒకవేళ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమిస్తే ఆయా అధికారుల బాగోతం కూడా బయట పడుతుందనే భయంలో ఉన్నట్లు తెలుస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకున్న ఈ 'అవినీతి రాజు' ఉన్నతాధికారులను సైతం తన కనుసన్నల్లో నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. అవినీతిని నిర్మూలిస్తానని హెూం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలి రోజునే ప్రతినబూనిన వంగలపూడి అనిత ... రాష్ట్రంలో ఎస్ ఈ బీ శాఖలోని అవినీతి అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలని గుంటూరు జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను తాము చేయలేమని, తమ ప్రభుత్వం రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తోందని ... ఉపన్యాసాలు ఇస్తున్నప్రస్తుత పాలకులు, గుంటూరు జిల్లా ఎస్ ఈ బీ శాఖలో జరుగుతున్న అవినీతి పై ఎలాంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాలి. దీంతోపాటు పోలీసు శాఖలో కొందరు ఉద్యోగులు చేస్తున్న అక్రమ వసూళ్ల దందాపై చర్యలు తీసుకొని హెూం మంత్రి తాను ఇచ్చిన మాటను ఏ విధంగా నెరవేర్చి నిలబెటుకుంటుందో, తద్వారా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని తన చిత్తశుద్ధిని చాటుకుంటుందో వేచి చూడాల్సిందే. దీనిపై వివరణ కోరేందుకు ఎక్సైజ్ అధికారి గుంటూరు జోన్ -2 ను సంప్రదించగా ఎలాంటి స్పందన లేకపోవడం విశేషం.

## మంత్రుల పేషీ అధికారులపై రగడ

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఏ ప్రభుత్వం ఇప్పుడిప్పుడే పూర్తిగా కొలువుతీరు తోంది. దాదాపు అందరు మంత్రులూ అధికారబాధ్యతలను అధికారికంగా స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత కొందరు మంత్రులు తమ చాంభర్‌లను ఆధునీకరించుకుంటున్నారు. గత వైకాపా ప్రభుత్వం అమరావతి సచివాలయాన్ని బీడు పెట్టింది. అక్కడ అధికారిక కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నా..కనీసం చిన్నచిన్నమరమ్మత్తులను సైతం చేయలేదు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో సచివాలయాన్ని ఆధునిక వసతులతో నిర్మించారు. అన్ని భవనాలను సెంట్రల్ ఏసీ సౌకర్యాన్ని కల్పించారు. ఆధునిక హంగులతో సచివాలయం మెరిసిపోయేది. అయితే...జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లు దాన్ని వాడుకుని పూర్తిగా పాడుబెట్టేశారు. ఇప్పుడు నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారికి కావాల్సిన విధంగా కొన్ని మరమ్మత్తులు చేయించుకుంటున్నారు. ఒకవైపు కార్యాలయాలను మరమ్మత్తులు చేయించుకుంటున్న మంత్రులు మరోవైపు తన కార్యాలయ పేషీ అధికారుల నియామకంపై కసరత్తులు చేస్తున్నారు.




గత జగన్ ప్రభుత్వంలో మంత్రుల పేషీలో పనిచేసిన అధికారులను ప్రస్తుత మంత్రులు తమ వద్ద నియమించుకోవద్దని అనధికారికంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి గత జగన్ ప్రభుత్వంలో మంత్రుల పేషీలో వివిధ హెూదాల్లో పదవులు నిర్వహించిన వారు పూర్తిగా అవినీతిలో కూరుకుపోయారని, అప్పటి మంత్రులకు అవినీతి సొమ్ము భారీగా దోచిపెట్టారని, దోచిపెట్టడంతో పాటు వారూ వాటాలు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాత వారిని మంత్రుల కార్యాలయంలో నియమించుకోవద్దని సిఎం చెప్పినట్లు తెలుస్తోంది. అయితే కొందరు మంత్రులు మాత్రం వారే కావాలని ముఖ్యమంత్రి వద్ద పట్టుబడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. గతంలోమంత్రులుగా వ్యవహరించిన వారే ఈ విధంగా చేస్తున్నారని, కొందరు తెలంగాణలో పనిచేసే అధికారులు కావాలని కోరితే ముఖ్యమంత్రి తిరస్కరించారని చెబుతున్నారు. కాగా మరికొందరుమాత్రం జగన్ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు కావాలని పట్టుబడుతున్నారు. అయితే వీరి కోర్కెలను సిఎం తిరస్కరించినట్లు తెలుస్తోంది. మొత్తం మీద రాబోయే వారం రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. ( జనం ఆన్ లైన్ సౌజన్యంతో)

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ):** అంకిత భావం, పేద రోగులకు నిస్వార్ధంగా సేవ చేసే భాగ్యం కేవలం వైద్యులకు మాత్రమే లభిస్తుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా పలువురు వైద్యులు, వైద్యేతర సిబ్బంది డాక్టర్ కిరణ్ కుమార్ కు అభినందనలు తెలుపుతూ శాలువా తో సత్కరించారు. డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎస్ వీ రమణ, డాక్టర్ రమేష్‌లు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ టిటికె రెడ్డి లను శాలువా కప్పి సత్కరించారు.



ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ...దయేరియా వ్యాధి సోకి ప్రజలు ఇబ్బందులు పడిన సమయం లో వైద్యులు కష్టపడి అహర్నిశలు శ్రమ కూర్చీ పేద ప్రజల ప్రాణాలను కాపాడారని గుర్తు చేశారు. ఈ సంఘటనలో ఒక్క మరణం సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన అన్నారు. వైద్యులు, వైద్యేతర సిబ్బంది ప్రతి ఒక్కరు కూడా సమస్యలను చిరునవ్వుతు స్వీకరించి రోగులకు వైద్య సేవలు అందించారని ఆయన చెప్పారు. ఏడాదిలో ఆసుపత్రి కి గుర్తింపును తీసుకుని వచ్చామని ఆయన చెప్పారు. ఈ ప్రయాణం లో ఒక్కరి వల్ల సాధ్యపడదని అందరి కృషి తో ఆసుపత్రి వైద్య సేవలు ప్రజలకు చేరువ గా తీసుకుని రాగలిగామని ఆయన అన్నారు. ఈ విషయంలో కొంతమందికి కోపతాపాలు ఉన్న ప్రతిఒక్కరు సహకరించారని అయన గుర్తు చేసారు. కార్డియో దోరాసిక్ లో శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేస్తున్నామని ఆయన అన్నారు. రోగులకు సేవలు అందించే విషయం లో అసిస్టెంట్ ఆర్ ఏం ఓ ల పాత్ర ఎంతో కీలకమని అయన అన్నారు. పేద రోగులకు సేవలు అందించే విషయం లో ప్రత్యేక పాత్ర పోషించారని అయన అన్నారు. ఏ ఆర్ యం ఓ లు అందుబాటులో ఉంటూ పేదలకు అండగా నిలిచారని అయన అన్నారు. రానున్న రోజుల్లల్లో ప్రతి వైద్యం పేద వర్గాలకు అందించడమే కాకుండా చిరునవ్వుతో రోగులను ఇంటికి పంపిస్తామని ఆయన అన్నారు.

## ఇచ్చిన మాటకి కట్టుబడి రూ.4వేలు ఇస్తున్నాం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



**విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వంలో పెన్షన్ నగదు వెయ్యి రూపాయలు పెంచడానికి నాలుగేళ్లు పట్టిందని, కానీ ఎన్డీయే ప్రభుత్వంలో గెలిచిన నెలలోనే ఇచ్చిన మాటకి కట్టుబడి రూ. 4వేలు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సింహాచలం మండలం అడవివరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సోమవారం పెన్షన్ల పంపిణీ అనేది రాష్ట్రవ్యాప్తంగా పండగ వాతావరణంలా జరుగుతోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఉదయం 6గంటల నుంచే ప్రతి ఇంటికీ వెళ్లి నగదు ఇస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు.

ఈ సందర్భంగా వికలాంగులు, వృద్ధుల కళ్లల్లో ఆనందం చూసి మనసు చలించిందని ఎమ్మెల్యే గంటా అన్నారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీ ప్రజల ఇళ్ల వద్దకే చేరుతాయన్నారు. పెన్షన్ల పంపిణీతో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతి నెలా రూ. 819కోట్ల అదనపు భారం పడుతోందని అయినా.. దాన్ని ఎన్డీయే ప్రభుత్వం ఆనందంగా స్వీకరిస్తుందని ఆయన అన్నారు. సింహాచలంలో బీఆర్టీసీ టీడీఆర్ రోడ్డు సహా మిగతా సమస్యలపైనా ప్రత్యేక దృష్టిపెట్టి త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.

## పలువురు విజిలెన్స్ అధికారుల బదిలీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** సాధారణ పరిపాలనా శాఖలో భాగంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను వారి మాతృశాఖకు బదిలీ చేస్తూ ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతిలో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కె. ఈశ్వర్‌రెడ్డిని మంగళగిరిలో డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అలాగే కర్నూలు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ ఎన్ పూజితకు కడప, అనంతపురం జిల్లాల అదనపు బాధ్యతల తప్పించమే కాకుండా.. డీజీపీ కార్యాలయంలో వెంటనే రిపోర్టు చేయాలని ఆమెకు స్పష్టం చేశారు. విజయవాడ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరీముల్లా షరీఫ్‌కు తిరుపతి, కర్నూలు జిల్లాల బాధ్యతలను సైతం అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఇక గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె. ఈశ్వర్ రావుకు అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని జారీ చేసిన ఉత్తర్వుల్లో డీజీ స్పష్టం చేశారు.

జర్నలిస్ట్ ఫైల్
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా..
సంప్రదించండి - 7661805968
అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు...
సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467